# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 109 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

25-02-2026 బుధవారం వెల : 1 /- పేజీలు : 4


# అప్పల సూర్యనారాయణకు అసెంబ్లీ నివాళి



- అసెంబ్లీలో గుండ అప్పల సూర్యనారాయణకు సంతాప తీర్మానం
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీర్మానం ప్రవేశపెట్టారు
- సభ్యులు, సీఎం చంద్రబాబుకు గుండ లక్ష్మీదేవి కృతజ్ఞతలు
- భర్త సేవలను స్మరించుకుని భావోద్వేగం
- నీతి, నిజాయితీలకు కట్టుబడి సేవలందించిన నేతగా కీర్తి
- మహానేత సేవలను సభలో గుర్తుచేసిన సభ్యులు



(నవతరం శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా దివంగత నేత, మాజీ మంత్రివర్యులు గుండ అప్పల సూర్యనారాయణ గారికి రాష్ట్ర శాసనసభలో ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన ప్రజా సేవలను స్మరిస్తూ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా సభ సభ్యులు మౌనం పాటించి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యురాలు గుండ లక్ష్మీదేవి ఒక ప్రకటన విడుదల చేస్తూ తన భర్తకు అసెంబ్లీలో నివాళులు అర్పించిన సభాపతి, సభ్యులు, గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సుదీర్ఘకాలం ప్రజా సేవలో విశేష పాత్ర పోషించిన బడుగుల నేత గుండ అప్పల సూర్యనారాయణ గారి సేవలను రాష్ట్ర శాసనసభ గుర్తుచేసుకోవడం తమ కుటుంబానికి గౌరవకరమని పేర్కొన్నారు.
తెలుగుదేశం అధినేత నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సభా సంప్రదాయాలను పాటిస్తూ ఆయన సేవలను గుర్తు చేయడం తనను భావోద్వేగానికి గురిచేసిందని గుండ లక్ష్మీదేవి తెలిపారు. ప్రజా జీవితంలో నీతి, నిజాయితీలే ముఖ్యమని, వ్యవస్థల్లో నిబంధనల అమలు ప్రజాస్వామ్యానికి బలమని నమ్మి తుది శ్వాస వరకు అదే సిద్ధాంతాలను ఆచరించిన మహానేతగా సభ సభ్యులు అప్పల సూర్యనారాయణ గారిని కీర్తించడం తనకు మరింత గర్వకారణమైందని చెప్పారు.
అప్పల సూర్యనారాయణ గారు ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేసిన నాయకుడిగా గుర్తింపు పొందారని, సామాన్య ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించిన ఆయన సేవలను సభలో మరోసారి స్మరించడం ప్రజా నాయకత్వానికి ఉన్న గౌరవానికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు.
ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ పలువురు సభ్యులు వ్యక్తపరిచిన సానుభూతి సందేశాలు తనను తీవ్ర భావోద్వేగానికి గురిచేశాయని, సభలో కన్నీటి నివాళులు అర్పించిన ప్రజాప్రతినిధులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు గుండ లక్ష్మీదేవి తెలిపారు. మహానేత గుండ అప్పల సూర్యనారాయణ గారి ఆశయాలు, ప్రజాసేవా మార్గం తరం తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని, ఆయన చూపిన మార్గంలో ప్రజా సేవ కొనసాగించడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని ఆమె తన ప్రకటనలో పేర్కొన్నారు.

# దమ్మల వీధిలో డయేరియా కలకలం

- కలుషిత తాగునీటి వల్ల ఒకరి మృతి
- జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులు
- ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం
- ధర్మాన రామ మనోహర్ నాయుడు ఆగ్రహం
- అర్ధరాత్రి నుంచి వాంతులు, విరోచనాలతో ఆసుపత్రులకు తరలింపు
- అధికారులపై తీవ్ర విమర్శలు





నవతరం శ్రీకాకుళం

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని దమ్మల వీధిలో డయేరియా వ్యాధి కలకలం రేపింది. కలుషిత తాగునీటి కారణంగా వ్యాధి వ్యాపించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. డయేరియాతో బాధపడుతూ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న మండల సురేష్ మృతి చెందడం తీవ్ర విషాదానికి గురిచేసింది. అర్ధరాత్రి నుంచి వాంతులు, విరోచనాలతో బాధపడుతూ పలువురు ఆసుపత్రిలో చేరారు. ఇప్పటివరకు దాదాపు 25 మంది వ్యాధి బారిన పడినట్లు సమాచారం. బాధితులు జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. డయేరియా బాధితులను స్ట్రెచర్‌పై మోసుకుంటూ అంబులెన్స్‌లో తరలించిన ఘటన స్థానికంగా ఆందోళనకు గురిచేసింది.
డయేరియా బాధితులను యువనేత ధర్మాన రామ మనోహర్ నాయుడు పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య లోపాలు, తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం కారణంగానే డయేరియా వ్యాప్తి చెందిందని ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శించారు. ప్రజల ప్రాణాలు పోతున్నా అధికారులు సమయానికి స్పందించకపోవడం దారుణమన్నారు.
ప్రభావిత ప్రాంతాల్లో వెంటనే శుద్ధి చర్యలు చేపట్టి, కలుషిత తాగునీటి సరఫరాను నిలిపివేసి శుభ్రమైన నీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు మృతుడి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సాధు వైకుంఠం, చల్ల శ్రీనివాసరావు, మండవల్లి రవి, భయ్యా, కన్నబాబు, అల్లిబిల్లి విజయ, మాలపల్లి లత, పొన్నడ రుషి, రమేష్, గుడ్ల దామోదర్, ఎన్ని చక్రవర్తి, గుంటముక్కల పాపారావు, తెలుగు రమేష్, ఎం.కె. బెగ్, భరత్వాజ్, కింజరాపు రమేష్, అప్పు యాదవ్, బైపురెడ్డి నాని తదితర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డయేరియా బాధిత కుటుంబానికి అండగా కూటమి ప్రభుత్వం

- మృతుని కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ప్రకటించిన కూటమి ప్రభుత్వం
- సకాలంలో చొరవ చూపి మానవత్వం చాటుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- ముఖ్యమంత్రి దృష్టి కి సమస్యను నివేదించి పరిహారం చెల్లింపునకు ప్రత్యేక చొరవ
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో వెనువెంటనే పరిహారం ప్రకటన..



(నవతరం శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధిలో డయేరియా కారణంగా తుది శ్వాస విడిచిన మృతుని కుటుంబానికి అండగా కూటమి ప్రభుత్వం నిలిచింది. రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు

-మిగతా 2లో

# శ్రీకాకుళంలో అతిసారం వ్యాప్తి ఆందోళనకరం

- బాధితులకు తక్షణ వైద్యం, శుద్ధి చర్యలు చేపట్టాలి
- ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విమర్శ
- మెంటాడ వెంకట పద్మావతి





నవతరం శ్రీకాకుళం

శ్రీకాకుళం పట్టణంలో అతిసారం వ్యాధి తీవ్రంగా వ్యాపించడం అత్యంత ఆందోళనకర విషయమని జిల్లా వైఎస్సార్సీపీ ఉపాధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మెంటాడ వెంకట పద్మావతి పేర్కొన్నారు. ఇప్పటివరకు సుమారు 60 మంది బాధితులు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారని, దురదృష్టవశాత్తు ఒకరు ప్రాణాలు కోల్పోవడం మరింత బాధాకరమని తెలిపారు.
ఈ రోజు బాధితులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నట్లు

-మిగతా 2లో

ఎడిటోరియల్

# భగవత్ (వి)భజన!

హిందూ జనాభా తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు మరోసారి దేశ రాజకీయాల్లో విభజన రేఖలు సృష్టించాయి. జనాభా చర్చ పేరుతో మతాల మధ్య అనుమానాలు రేకెత్తించాయి. ఇవి దేశాన్ని 'మెజారిటీ-మైనారిటీ' కోణంలో నిలబెట్టి రాజకీయ లబ్ధిపొందే వ్యూహమా? లేక 'విభజించు- పాలించు' విధానాన్ని బలపరిచే కోణమా? అన్న ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. మొన్న ఉత్తరప్రదేశ్ లక్నోలోని సరస్వతీ శిశు మందిర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'హిందూ కుటుంబాలు ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చేందుకు ఆలోచించాలి' అన్నారు. భారత రాజ్యాంగం ప్రతిపౌరుడికి తన జీవనశైలిపై స్వేచ్ఛ ఇస్తుంది. కుటుంబ నిర్ణయాలను ఒక సిద్ధాంతపరమైన ఆదేశంలా చెప్పడం వ్యక్తిగత స్వేచ్ఛకు విరు ద్ధం. భగవత్ 'ప్రేరణ' రాజ్యాంగం కల్పించిన హక్కులపై పరోక్ష జోక్యా నికి ఆస్కారమిస్తుంది. దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న జీవన వ్యయంలో 'ఎంతమందిని పోషించగలము' అన్నది కూడా ప్రధానం. ఇప్పుడు తల్లిదండ్రులు ఆలోచిస్తున్న ది- పిల్లలు ఎక్కువగా ఉండటం కన్నా, ఉన్న వారికి మంచి చదువు, ఉద్యోగం కల్పించాలని. గణాంకాలు చెప్పేది ఏమిటంటే- దేశంలో జనాభా వృద్ధిరేట్లు క్రమంగా తగ్గడం వాస్తవం. విద్య, పట్టణీకరణ, ఉపాధి, ఆరోగ్య సదుపాయాల పెరుగుదల వంటి సామాజిక, ఆర్థిక కారణాల వల్లే కుటుంబ పరిణామం తగ్గుతోంది. ఇది ఒక సహజ పరిణామం. దీన్ని ప్రత్యేకంగా ఒక మతానికి అంటగట్టడం, సమాజంలో అనుమానం, భయాన్ని పెంచి 'మనసంఖ్య తగ్గిపోతోంది' అన్న ఆలోచనను నాటడం మత విభజనకు దారితీయడమే. ఇది ముస్లిం, మైనారిటీ వర్గాలతో ప్రమాదమని చూపించే కుట్రలో భాగమే! ఇంకా చెప్పాలంటే, హిందువులను ఒకే ఫ్రేమ్‌లోకి తీసుకొచ్చి బంధించడం, ఇతరులు మనవారు కాదన్న ఆలోచనను నూరిపోయడం. మహిళల స్వాతంత్ర్యం, కుటుంబ ఆర్థికస్థితి, పిల్లల విద్యావకాశాలు-ఇవన్నీ పక్కనపెట్టి సంఖ్యా రాజకీయాలకే ప్రాధాన్యం ఇవ్వడం. ఇదంతా సమాజాన్ని తిరోగ మనంలో పడేసే దిశ తప్పవేరే కాదు. ముగ్గురు పిల్లల్ని కనాలన్న 'భగవత్ సూత్రం' మహిళలను 'వంటింటికే పరిమితం' చేసే ధోరణి. వారు జనంపై రుద్దాలనుకుంటున్న మనుస్మృతి చెప్పేది కూడా అదే. స్త్రీలకు ఉద్యోగం, స్వతంత్ర నిర్ణయం వంటి వాటిని రెండోస్థానంలోకి నెట్టేయత్నం. అభివృద్ధి చెందిన దేశాలు మహిళల సాధి కారతను పెంచి జనాభాను స్థిరీకరి స్తుంటే, ఇక్కడ మాత్రం వారిని 'పిల్లల్ని కనే యంత్రాలుగా' చూడటం దారుణం. 'ఇతర మతాల్లోకి వెళ్లినవారిని హిందూమతంలోకి తీసుకురావాలని' కూడా వారు సెలవిచ్చారు. రాజ్యాంగం ప్రతిపౌరుడికి ఇచ్చిన హక్కు- తన మతాన్ని అనుసరించడం లేదా మార్చుకోవడం. అయినా బలవంతపు మతమార్పిడి అన్నది 'ఆరెస్సెస్ కట్టుకథ', దాని చుట్టూ అల్లిన భావోద్వేగపు వల. కేరళలో కూడా మత మార్పిడి జరుగుతుందని ప్రచారం చేసి లెక్కలు చెప్పమంటే భిక్కముఖ మేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం నూట ఇరవై కోట్ల జనాభాలో మెజారిటీ హిందువులు ఎనభై శాతం. మిగతా అన్ని మతాల వారు కలిసి పద్దెనిమిది శాతానికి మించరు. ఇక్కడ ప్రమాదం పొంచి ఉందన్న పోలిక కూడా సరితూగదు. ఈ చర్చను భగవత్ ఇప్పుడెందుకు తీసుకొచ్చారు? ఎన్నికల ముందు ఏదో ఒక అంశాన్ని తెరపైకి తెచ్చి రాజకీయ లబ్ది పొందడం 'సంఫ్ఘ్ పరివారానికి' వెన్నెతో పెట్టిన విద్య. రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మెజారిటీ హిందువుల ఓట్లను 'తమ బుట్టలో' వేసుకోవాలన్న 'పన్నాగం'. నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతు సమస్యలు, పేద, ధనిక అసమానతలు వంటి ప్రశ్నలు, నిరసనల నుంచి ప్రజల దృష్టిమళ్లించడం. ఆయన మాటల సారాంశం ప్రత్యక్షంగా ఎవరినీ లక్ష్యంగా చూపకపోయినా, పరోక్షంగా ఒక మతాన్ని 'ఇతర'గా చూపించే వాతావరణం ఏర్పరుస్తుంది. మెజారిటీ, మైనారిటీ అన్న విభజనను సృష్టిస్తుంది. ఇది లౌకిక వాదానికి తీవ్రముప్పు. జనాభా, సంస్కృతి, మతం పేరుతో గీసే ప్రతీ విభజన రేఖను ప్రశ్నించడం, అడ్డుకోవడం పౌర సమాజం కర్తవ్యం. 'ముగ్గురు పిల్లల్ని కనాలి' అన్నది కూడా సామాజిక సలహా కాదు, అది వారి సిద్ధాంత ఎజెండాలో భాగం. 'సంఖ్య తగ్గిపోతోంది', 'సంస్కృతి ప్రమాదంలో ఉంది' అన్న భావన మెజారిటీ ఐక్యత పేరుతో చేసే రాజకీయ సమీకరణం. మైనారిటీలను అనుమానపు దృష్టితో చూపించడం, లౌకిక విలువలను బలహీన పరచడం వారి లక్ష్యాలు. అందుకే లెనిన్ అన్నారు-' ఏ నినాదం వెనుక ఏ వర్గ ప్రయోజనం దాగుందో తెలుసుకోలేనంత కాలం.. ప్రజలు మోసపోతూనే ఉంటారు' అని.

# డయేరియా బాధిత కుటుంబానికి అండగా కూటమి ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో సమస్యను గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకుని వెళ్లి ప్రభుత్వం తరఫున పరిహారం అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రజారోగ్యమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, ఇందులో భాగంగా పటిష్ట చర్యలు క్షేత్ర స్థాయిలో తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటూనే, ఇతర బాధిత కుటుంబాలకు సైతం ఆరోగ్య రీత్యా మెరుగైన వైద్యం అందేవిధంగా, వైద్యుల నిరంతర పర్యవేక్షణ ఉండేవిధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

డయేరియా ప్రభావిత ప్రాంతాలలో వైద్యాధికారులు, మున్సిపల్ అధికారులు క్షేత్ర స్థాయి పనిచేస్తున్నారని,పారిశుద్ధ్య పనులతో పాటూ వాటర్ ట్యాంకర్లతో తాగునీటిని అందించే ఏర్పాటు చేస్తున్నారని, తాను ఎప్పటికప్పుడు అధికారులతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్నానని అన్నారు. బాధిత ప్రజలు ఎవ్వరూ అధైర్య పడవద్దని, కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

# ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

నవతరం -శ్రీకాకుళం



శ్రీకాకుళం నగరంలోని దమ్మల వీధి, కాకి వీధి, గుడి వీధి, మంగువారి తోట ప్రాంతాల్లో ఈ నెల 22 నుంచి ప్రబలిన అతిసారం (డయేరియా) ప్రస్తుతం అదుపులోకి వస్తోందని టిడిపి నాయకులు తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర-రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ మార్గదర్శకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజారోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముందుగా ప్రజల సంరక్షణే ముఖ్యమని, తరువాతే రాజకీయ విమర్శలు అని పేర్కొన్నారు. మాదారపు వెంకటేష్, రాష్ట్ర ఎస్‌వి సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్‌వి రమణ మాదిగ, 38, 39 డివిజన్ ఇంచార్జీలు కొమర కమల, కేశవ రాంబాబు, నాయకులు పొన్నాడ రవి తదితరులు దమ్మల వీధి ప్రాంతంలో ఈరోజు పర్యటించారు. వందాన సిమ్మన్న ఆసుపత్రిని సందర్శించి బాధితులను పరామర్శించారు.

# శ్రీకాకుళంలో మహిళా దినోత్సవ వేడుకలు

నవతరం -శ్రీకాకుళం

మార్చి 8 న ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళింగ వేదిక ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగంరలోని స్థానిక ఎస్ కన్వేన్షన్ హాల్‌లో ఆరోజున మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు బిగ్ బాస్ ఫేమ్ దువ్వాడ మాధురి శ్రీనివాస్ తెలిపారు ఈ మేరకు మంగళవారం సాయంత్రం స్థానిక ఎస్ కన్వేన్షన్ హాల్ లో నిర్వహించిన సమావేశంలో మాధురి మాట్లాడుతూ మహిళా దినోత్సవంనకు సంబంధించి ఉత్సవాల వివరాలను మీడియాకు వెల్లడించారు.ఈ కార్యక్రమాన్ని అకిరా డాన్స్‌ప్లానెట్ బృందం ఆర్గనైజ్ చేస్తుందని చెప్పారు. అలాగే సత్యవతి ఎస్ పీ నాయుడు,తన నేతృత్వంలో కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. మహిళలంతా పెద్ద ఎత్తున పాల్గొని మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.. మరెన్ని వివరాలకు 8143494691 కు ఫోన్ చేసి వివరాలను తెలుసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో మహిళా ప్రతినిధులు గుంట జ్యోతి, పూడి కమల, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# శ్రీకాకుళంలో అతిసారం వ్యాప్తి ఆందోళనకరం

మొదటిపేజీ తరువాయి

ఆమె చెప్పారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అవసరమైన వైద్య సహాయం అందించాలని అధికారులను కోరినట్లు వెల్లడించారు.

ఇలాంటి పరిస్థితి ఏర్పడటానికి ప్రధాన కారణం ప్రభుత్వ నిర్లక్ష్యం, తాగునీటి సరఫరాలో లోపాలు, పారిశుద్ధ్య వ్యవస్థలో వైఫల్యమేనని స్పష్టంగా కనిపిస్తోందని ఆమె విమర్శించారు. ప్రజల ప్రాణాలపై నిర్లక్ష్యం అస్సలు సమర్థించదగినది కాదన్నారు.

ప్రభావిత ప్రాంతాల్లో వెంటనే శుద్ధి చర్యలు చేపట్టాలని, తాగునీటి నాణ్యతను పరిశీలించి శుభ్రమైన నీరు సరఫరా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించాలని కోరారు.

ప్రజల ఆరోగ్యం పరిరక్షించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని పేర్కొంటూ, ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# సోలార్ పవర్ వైపు ఆసక్తి చూపుతున్న ప్రజానీకం



నవతరం -పలాస

- గ్రామ సీమల్లో సోలార్ వెలుగులు
- పీఎం సూర్య ఘర్ పథకానికి ఆదరణ
- థర్మల్ విద్యుత్ కంటే సోలార్ విద్యుత్ వైపు జనం మొగ్గు
- లబ్ధిదారులకు రుణ సదుపాయం
- వినియోగదారులకు బ్రాండెడ్ కంపెనీ సామాగ్రి మరియు ఉత్తమ సర్వీస్ అందిస్తున్న వారాహి ఎంటర్ ప్రైజెస్




పర్యావరణ పరిరక్షణతో పాటు స్థిరమైన అభివృద్ధి జరగాలంటే తరిగిపోని శక్తి వనరులు అత్యంత అవసరం. అపరిమితంగా లభ్యమవుతూ, ఎన్నటికీ తరిగిపోని ఇంధన వనరులలో సౌర శక్తి ఒకటి. ఇంధన భద్రతతో పాటు తక్కువ నిర్వహణ ఖర్చుతో దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించే సోలార్ విద్యుత్తుకు ప్రపంచం మొత్తంలోనూ ప్రాధాన్యం పెరుగుతుంది. ఈ మధ్యకాలంలో వచ్చిన అధునాతన సాంకేతిక మార్పుగా అవతరించి, సామాజికంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న వాటిలో ' సోలార్ విద్యుత్ ప్యానెల్స్ హవా కొనసాగుతున్నాయి. ఈ అంశం సామాజిక జీవన వైవిధ్యంలో పెనుమార్పులకు నాంది పలుకుతున్నాయి. ఒకవైపు విపరీతంగా పెరిగిపోతున్న విద్యుత్ చార్జీలు, వెరసి అందరి చూపు సోలార్ విద్యుత్ వైపునకు మళ్లింది. దశాబ్ద కాలం గానే సోలార్ కు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నప్పటికీ అది నగరాల వరకే పరిమితమైంది. కానీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి యం సూర్యగర్ ముఫ్ఫ్ బిజిలి యోజన పథకంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ సోలార్ సెట్ పై ఆసక్తి చూపుతున్నారు. ఈ స్కీమ్ లో భాగంగా దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు పైగా సోలార్ వ్యవస్థను వ్యాప్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ప్రత్యేక సబ్సిడీలను సైతం అందిస్తున్నారు. కొన్నేళ్లుగా సోలార్ వ్యవస్థ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న వ్యాపార సంస్థల సైతం ఈ సందర్భంగా వారి సేవలు పెంచుతున్నాయి. సౌర శక్తి సామర్థ్యంలో భారతదేశంలోని అగ్రగామి రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలుస్తుంది. సోలార్ విద్యుత్ వినియోగించే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఇప్పుడిప్పుడే ఈ విధానానికి అలవాటు పడుతున్నారు. ఈ సోలార్ పద్ధతులు వ్యక్తిగత గృహాలతో పాటు చిన్న, మధ్య, పెద్ద తరహా పరిశ్రమల్లోనూ విరివిగా వాడుతున్నారు. వారి వారి విద్యుత్ వాడకానికి అనుగుణంగానే పీఎం సూర్య ఘర్ స్కీములో ఒక కిలో వాట్ నుంచి వినియోగాన్ని బట్టి, అవసర మైనన్ని కిలోవాట్ల సోలార్ సెట్ లను, వాటికి సబ్సిడీని అందిస్తుంది. గతంలో ఇళ్ల లో రూ 250 నుంచి రూ. 500ల కరెంట్ బిల్లు అత్యధికంగా అనుకుంటే, ఇప్పుడు అది దాదాపు 1000 నుంచి పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో సౌర శక్తి ఉత్పత్తిని మెరుగుపరచడానికి ' ప్రధానమంత్రి సూర్య ఘర్ ముప్తి బిజిలి యోజన పథకం 2024 లో ప్రారంభమైంది. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సోలార్ సబ్సిడీ పథకం పేద ప్రజల్లో సైతం వెలుగులు నింపుతుంది. తక్కువ పెట్టుబడితో సొంత బిల్డింగ్ పైన సోలార్ ప్యానల్ నెంబర్ చూస్తే మనం ఉత్పత్తి చేసే విద్యుత్ ద్వారా మనకు వచ్చే విద్యుత్ చార్జీలను పూర్తిగా తగ్గించుకోవచ్చు. మనం వినియోగించుకున్న విద్యుత్ సరిపోగా మిగిలిన విద్యుత్తును గ్రిడ్ కైనా పంపిణీ చేయడం వల్ల తిరిగి లబ్ధిదారులకి ఆదాయం పొందడానికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. ఒక మాటలో చెప్పాలంటే సోలార్ పవర్ వినియోగదారులే ఉత్పత్తిదారులు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గంలో పాటు ఇచ్ఛాపురం, టెక్కలి నియోజకవర్గా లలో సోలార్ విద్యుత్తు పై గృహ వినియోదారుల్లో చైతన్యం పెరుగుతుంది. సూర్య ఘర్ కింద ఎవరైతే సోలార్ విద్యుత్ వినియోగించుకో దలుచు కున్నా రో వారందరికీ బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తున్నాయి. అయితే ఈ సోలార్ సిస్టం ఎంచుకునేటప్పుడు ఆమోదిత బ్రాండ్లను ఎంపిక చేసుకోవలసి ఉంది. ఇందులో బ్లూ బర్డ్ సోలార్, టాటా పవర్ సోలార్, వారి ఎనర్జీస్, విక్రమ్ సోలార్, అదానీ సోలార్, రెన్యుసిస్ వంటి అగ్రశ్రేణి సోలార్ ప్యానల్ తయారీదారులు. అదేవిధంగా సోలార్ ప్యానల్ ఇన్స్టలేషన్ తోపాటు దీర్ఘకాలం మన్నిక వచ్చే విధంగా సర్వీస్ సెంటర్ కూడా ముఖ్యం. పలాస కేంద్రంగా వారాహి సోలార్ ఎంటర్ప్రైజెస్ వినియోగదారులకు అవగాహన ప్రభుత్వ అధికార యంత్రాంగం తో పాటు కొన్ని స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తుంది. అందులో భాగంగా ఆదివారం నాడు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద విద్యుత్ శాఖ అధికారులతో పాటు వివిధ బ్యాంకుల అధికారులతో కలిసి అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు వారాహి సోలార్ పవర్ ఎంటర్ ప్రైజెస్ నిర్వాహకులు రెయ్యి నారాయణ రావు, కొర్రయి శ్రీకాంత్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 9885549657 నెంబర్ కి ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు అన్నారు.

# తమిళనాడులోని...... ప్రాచీన ఆలయం కుంభకోణం

కుంభోణం ఒక ప్రాచీన ముఖ్య వ్యాపార కేంద్రము మరియు పవిత్ర యాత్రాస్థలం. ఈ పట్టణం తమిళనాడు తంజావూరు జిల్లాలో కావేరీనది గట్టున ఉంది. కామకోటి పీఠానికి చెందిన శ్రీ శంకరాచార్యులవారి మఠం 1743లో తంజావూరు మహారాజావారి ప్రత్యేక విజ్ఞాపనము ననుసరించి కుంభకోణానికి మార్చబడింది. ఈ పట్టణములో ప్రవహించే కావేరీ నది సువిశాలమైన వరిపొలాలు, అరటి తోటలు, తమలపాకుల తోపుల మధ్య ఉంది. దక్షిణ భారతదేశపు ఆక్స్ఫర్డ్ నగరం' అని ఆంగ్లేయులు కొనియాడిన ఈ పట్టణంలో 12 శివాలయాలు, నాలుగు విష్ణు దేవాలయాలే గాక అపురూపమైన బ్రహ్మదేవాలయం కూడా ఒకటి ఉంది. పట్టణ మధ్య భాగంలో శ్రీసారంగ పాణి (విష్ణు) ఆలయం మిక్కిలి పెద్దది, దీని గోపురం 250 అడుగుల ఎత్తుగా ఉంటుంది. మిక్కిలి ప్రాచీనమైనది కుంభేశ్వరస్వామి ఆలయము. ఇది ఒక బ్రహ్మాండమైన శివాలయం. సుమారు 350 అడుగుల పొడవు, 156 అడుగుల వెడల్పుగల అనేక దుకాణాలతో నిండిన హాలుగుండా 10 అంతస్థుల ఎతైన గోపురం గల దేవాలయానికి వెళ్లాలి. ఇచ్చట అమ్మవారు మంగళాంబిక, ఇచ్చట ఉండటంవల్ల దీనికి కుంభేశ్వర అని పేరు వచ్చింది. ఈ లింగానికి సుగంధ ద్రవ్యాలలేపన తప్ప నిత్యాభిషేకాలు జరుగవు. తిరునాగేశ్వరం మరియొక పెద్ద దేవాలయం. ఇచ్చట చిత్తిరై తమిళమాసంలో సూర్యకిరణాలు సరాసరి గర్భాలయంలో మధ్యనున్న లింగంపై పడునట్లు గోపురం నిర్మించబడింది. ఇచ్చట విశాలమైన నటరాజ మంటపానికి అతి నైపుణ్యంగా చెక్కబడిన పెద్ద పెద్ద రాతి చక్రాలు అమర్చబడి చక్కని శిల్పసౌందర్యంతో చెక్కబడిన గుర్రములు ఈ రథాన్ని లాగుతున్నట్లు ఉంటాయి.

కుంభేశ్వరాలయానికి దగ్గరగా రామస్వామి మాలయం ప్రసిద్ధమైనది. దశావతారాలు, రామాయణకథల శిల్పాలతో చెక్కబడిన ఏకరాతి స్తంభాలతో ఈ దేవాలయ మంటపాలు హృదయ రంజకంగా ఉంటాయి.

మహామాఘం ఉత్సవం 12 సంవత్సరాలకొకసారి మహామాఘం కోనేరులో వైభవంగా జరుగుతుంది. మాఘమాసంలో గురుడు సింహరాశిలో చేరినప్పుడు సౌరమానం ప్రకారం 11వ నెల పౌర్ణమిరోజున అంటే గ్రెగోరియన్ కాలెండరు ప్రకారం జనవరి, ఫిబ్రవరి మాసాలలో ఈ ఉత్సము జరుగుతుంది ఆ సమయంలో అనేక భక్తులు వివిధ ప్రాంతాల నుండి వచ్చి స్నానాలు చేస్తారు మహామాఘన కోనేరు మిక్కిలి విశాలమైనది కోనేరు చుట్టూ ఒకే సీతగా నిర్మించండిన 15 మంటపాలు ఉన్నాయి. ఈ మంటపాలు 16వ శతాబ్దంలో అచ్యుతనాయక రాజు మంత్రి గోవింద దీక్షితులు హైందవమత సాంప్రదాయం ప్రకారం రాజు చేసిన 16 దానాల జ్ఞాపకార్థల నిర్మించాడని చరిత్ర రాటుతుంది. 20 ఎకరాల వైశాల్యం కలిగిన ఈ పెద్ద కోనేటిలో 20 బావులు ఉన్నాయి. మహామాఘణ రోజున భారతదేశంలో గల పుణ్యనదులు నదీజలాలు ఈ బావులలోకి ప్రవహిస్తాయని ప్రతీతి. మంత్రాలయ శ్రీరాఘవేంద్రస్వామివారి పరమగురువులు శ్రీవిజయాంద్రతీర్థుల (పూర్వాశ్రమం పేరు విఠలాచార్యులు) బృందావనం- ద్వైతులకు అత్యంత పవిత్రమైన యాత్రాస్థలం ఇక్కడే కావేరీ తీరం మీద ఉంది. వీరు అప్పయ దీక్షితులను అనేక వాదములలో ఓడించారు. ఋుక్ ప్రస్థాన, ప్రమేయ దీపికా, ఉపనిషత్ ప్రస్థాన. అప్పయ్య కపోలవపేటికా, చక్రమీమాంస, నారాయణ శబ్దార్థ వచనం, నియచంపకమాల మొదలైన 104 సంస్కృత గ్రంధాలను రచించిన పండిత ప్రకాండుడు. పట్టణంలో ప్రవహించే కావేరీనది గట్టున ఉన్న కుంభకోణం కాలేజి దక్షిణదేశపు విద్యా సంస్థలలో బహుపురాతనమైనది. కుంభకోణానికి చేరువుగా దారాసురం ఐరావతేశ్వరాల యం శ్ని సౌందర్యం చెప్పనలవి కాదు.బంగారు, వెండి నగిషీ వస్తువులకు, అభరణాలకు, కంచు, ఇత్తడి వస్తువులకు, చేనేత వస్త్రాలకు కుంభకోణం ప్రసిద్ధి చెందింది. కుంభకోణం చుట్టుపక్కల పండింపబడే తమల పాకులు ఒక్క విధమైన సువాసనతో కూడా ఉంటాయి. దక్షిణాదిని స్త్రీపురుషులు అందరూ కుంభకోణం వెత్తలై (కుంభకోణం తమల పాకులు)ను ఎక్కువగా అభిమానిస్తారు. శివాలయాలలో కుంభేశ్వరాలయం అత్యంత ప్రాచీనమైంది. శివుడు బాణం వేయగా, అమృత కుంభం పగిలి, అమృతపు చుక్కలు పడిన చోటనే ఈ ఆలయాన్ని నిర్మించారు. అందుకే ఇది మహాముఖం తటాకం సమీపంలో కుంభేశ్వరాలయమైంది. కోణంలో (మూలలో) గల పట్టణం కుంభకోణమైంది. కుంభేశ్వరాలయాన్ని కాశీ విశ్వనాథాలయమని కూడా అంటారు. ఇందులో కాశీవిశ్వనాథుడు మూలవిరాట్టు రావణుడు సీతను అపహరించిన తరువాత శ్రీరాముడు సతీ వియోగ దుఃఖంతో ఈ ఆలయానికి వచ్చి, కాశీవిశ్వేరుని ఆరాధించాడు. ఈశ్వరుని కరుణతో ఈశ్వరాంశ సంభూతమైన రుద్రాంశను తన రుద్రాంశ వల్లనే రావణుని రాముడు యుద్ధంలో గెలవగలిగాడని వెబుతారు. ప్రయాగ, హరిద్వార్లలో జరిగే కుంభ మేళాల తరహాలోనే ఇక్కడ కూడా ప్రతి 12 సంత్సరాలకు ఒకసారి మహాముఖం జరుగుతుంది.






" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు


# డయేరియా బాధిత కుటుంబానికి అండగా కూటమి ప్రభుత్వం

**మొదటిపేజీ తరువాయి**

కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో సమస్యను గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకుని వెళ్లి ప్రభుత్వం తరపున పరిహారం అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రజారోగ్యమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, ఇందులో భాగంగా పటిష్ట చర్యలు క్షేత్ర స్థాయిలో తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటూనే, ఇతర బాధిత కుటుంబాలకు సైతం ఆరోగ్య రీత్యా మెరుగైన వైద్యం అందేవిధంగా, వైద్యుల నిరంతర పర్యవేక్షణ ఉండేవిధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

డయేరియా ప్రభావిత ప్రాంతాలలో వైద్యాధికారులు, మున్సిపల్ అధికారులు క్షేత్ర స్థాయి పనిచేస్తున్నారని,పారిశుధ్య పనులతో పాటూ వాటర్ ట్యాంకర్లతో తాగునీటిని అందించే ఏర్పాటు చేస్తున్నారని, తాను ఎప్పటికప్పుడు అధికారులతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్నానని అన్నారు. బాధిత ప్రజలు ఎవ్వరూ అధైర్య పడవద్దని, కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.



# ఎక్స్ క్లూజివ్-నాని సరసన త్రిప్తి దిమ్రి

యానిమల్ సినిమా అనగానే సందీప్ వంగా మాత్రమే గుర్తుకు రారు. రణ్ బీర్ కపూర్ తో పాటు త్రిప్తి దిమ్రి కూడా గుర్తుకు వస్తారు. ఒక్క పాత్రతో, ఆ ఒక్క సినిమాతో మన తెలుగు ప్రేక్షకులకు ముఖ్యంగా యంగ్ ఆడియన్స్ ను గుర్తుండిపోయింది ఆమె.

అంతే కాదు మళ్లీ ఆమె సినిమాలు ఏమి వస్తాయా అని ఆరా తీయడం మొదలుపెట్టారు. సందీప్ వంగానే ఆమెను మళ్లీ మరోసారి తను ప్రభాస్ తో చేస్తున్న సినిమాలోకి తీసుకున్నారు. అయితే అది కూడా యానిమల్ మాదిరిగానే మెయిన్ లీడ్ కాదు. కానీ విశ్వసనీయ వర్గాల బోగట్టా ప్రకారం త్వరలో ఆమె హీరో నాని సినిమాలో మెయిన్ లీడ్ గా చేయబోతున్నారని తెలుస్తోంది. హీరో నాని తన సినిమా కాస్టింగ్ విషయంలో చాలా కాలుక్యులేటెడ్ గా వుంటారు. పాన్ ఇండియా లెక్కలు ముఖ్యంగా హిందీ బెల్ట్ సంగతి గుర్తు పెట్టుకుంటారు. ఇప్పుడు ప్లానింగ్ లో వున్న ఓ సినిమా కోసం త్రిప్తి దిమ్రి ని తీసుకుంటున్నారని తెలుస్తోంది. అంతే కాదు, అదే సినిమా కోసం అలనాటి బాలీవుడ్ టాప్ హీరోయిన్ మాధురి దీక్షిత్ ను కూడా ఓ కీలకపాత్ర కు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఏమైనా సరే, నాని ప్లానింగ్ వేరుగా వుంటుంది.

# ఇది శర్వా పుష్ప.. కేజీఎఫ్ నా?

కొన్ని సినిమాలు అంతే చెరగని ముద్ర వేస్తాయి. కొన్ని పోస్టర్లు అంతే..చటుకున్న ఈ సినిమాలను గుర్తు చేసేస్తాయి. ఈ రోజు ఓ పోస్టర్ వచ్చింది. మాస్ యాక్షన్ సినిమాలు తీసే సంపత్ నంది డైరక్షన్ లో, శర్వానంద్ చేస్తున్న సినిమా. రాధామోహన్ నిర్మాత. ఈ పోస్టర్ చూడగానే పుష్ప.. కేజిఎఫ్ గుర్తుకు వచ్చాయి. ఎందుకంటే రగ్డ్ గెటప్, గ్రే షేడ్ లైటింగ్ వగైరాతో పోస్టర్ డిజైన్ చేసారు. సినిమా టైటిల్ భోగి. నిజానికి శర్వానంద్ మాస్ యాక్షన్ సినిమా చేసి చాలా కాలం అయింది. అందులోనూ ఇలాంటి గెటప్ లో కనిపించి కూడా. సంపత్ నంది అంటే ఆయనకు అచ్చి వచ్చిన జానర్ ఇదే కనుక కొత్తగా ఫీల్ కానక్కరలేదు. కానీ ఫ్యామిలీ ఇమేజ్, లవర్ బాయ్ ఇమేజ్ వున్న శర్వా ఒక్కసారిగా ఇలా టర్నింగ్ ఇచ్చుకోవడం అంటే కాస్త ఆలోచించాల్సిందే. శర్వానంద్ గెటప్ ఫుల్ మాస్సీగా వుంది పైగా చేతిలో పెద్ద సమ్మెట. నిల్చున్న పోశ్చర్ లో యాటిట్యూడ్ ఇవన్నీ కలిసే వీర ఊర మాస్ సినిమాలను గుర్తుకు తెచ్చింది. అంతకన్నా మరేం కాదు. నారీ నారీ నడుమ మురారి లవ్ స్టోరీ. దాని తరువాత బైకర్ స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్. ఆ తరువాత ఈ భోగి మాస్ యాక్షన్. శర్వానంద్ ప్లానింగ్ అయితే బాగానే వుంది.



# శ్రీకాకుళం జిల్లాలో జోరుగా గ్రానైట్ అక్రమ రవాణ

**నవతరం-శ్రీకాకుళం**



శ్రీకాకుళం జిల్లాలో జోరుగా గ్రానైట్ అక్రమంగా రవాణా జరుగుతుందని కొండలను పిండి చేయడంవలన పర్యావరణానికి ముప్పు కలుగుతుందని,రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా మంత్రి అచెన్నాయుడు, ఎంపీ కు చెందిన ఎం ఎల్ ఎ లు గ్రానైట్ అక్రమంగా త్రవ్వకాలు జరిపి రాత్రి వేళల్లో అక్రమంగా రవాణా చేస్తున్నారని ఇంటర్ నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోషిఏషన్ స్టేట్ సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతి నాయుడు ప్రకటనలో తెలిపారు . ముఖ్యంగా మంత్రి అచ్చెన్నాయుడు ఎం ఎల్ ఎ ల డైరెక్షన్ లో జరుగుతుందని లంబ, బొంతు, బొమ్మిక, అలుదు, కాగువడ, పాతటెక్కలి, మెలియాపుట్టి, కోటబొమ్మాళి ప్రాంతాల్లో జోరుగా అక్రమ గ్రానైట్ త్రవ్వకాలు జరిపి ఆక్రమ రవాణా పాల్పడుతున్నారని వీటితో కొండలు కరిగిపోతున్నాయని, వారితో కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని అయన అన్నారు . వీరితోపాటు అధికారుల పాత్ర ఉందని వీరిపై జిల్లా కలెక్టర్, ఎస్ పి లు సమగ్ర దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకొని అక్రమ గ్రానైట్ రావాణాను అడ్డుకట్ట వేయాలని స్టేట్ సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతి నాయుడు డిమాండ్ చేశారు. అక్రమంగా గ్రానైట్ రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోని యెడల కలక్టర్ పై డి ఓ పి టి కు మరియు సుప్రీంకోర్టు లో పిటిషన్ వేస్తానని. హెచ్చరించారు.

# మార్చి 5న ఛలో విజయవాడ జయప్రదం చేయండి...

**నవతరం-శ్రీకాకుళం**

ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని కోరుతూ మార్చి 5న ఛలో విజయవాడ జయప్రదం చేయాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కొత్తూరు మండల అద్యక్ష,కార్యదర్శిలు కె.జ్యోత్న్న.యస్.గౌరమ్మ.పి.జయలక్ష్మి.పూర్ణిమ పిలుపు నిచ్చారు. ఆశా వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశం కొత్తూరు వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఆశాలకు కనీసవేతనాలు చెల్లించాలని, అన్ని రకాల సెలవులు ఇవ్వాలని, మట్టిఖర్చులు ఇవ్వాలని, నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని, శిక్షణ పొందిన ఎఎన్ఎం, జిఎన్ఎం లకు పర్మినెంట్ పోస్టుల భర్తీసందర్భంగా ప్రాధాన్యత కల్పించాలని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశాల సంఖ్యను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశాలు సమస్యల పరిష్కారానికి మార్చి 5 వ తేదీన విజయవాడలో అలంకార్ సెంటర్ లో జరిగే మహా ధర్నాలో ఆశాలంతా పాల్గొవాలని కోరారు. ఆశాలకు వేతనాలు పెంచి 7 సంవత్సరాలు అయ్యింది. ఆశాలకు డిఎ అమలు చేయడం లేదు. కావున రెండు సంవత్సరాలకు ఒకసారి వేతనాలు పెంచాలి కానీ 7 సంవత్సరాలలో ఒక్క రూపాయి వేతనం కూడా పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని కోరారు.

20 సంవత్సరాలుగా ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఆశావర్కర్లకు శెలవులు లేకపోవడంతో




అనారోగ్యాల పాలౌతున్నారు. అన్ని రకాల శెలవులు ఆశా వర్కర్లుకు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం చెల్లించే 10 వేలలో నెలలో పి.హెచ్.సికు, ఆసుపత్రులకు వెళ్ళడానికి 3,4 వేలు ఖర్చులవుతున్నాయి. సంబంధంలేని పనులు చేయించడం, అధిక జనాభాలో పనిచేయటం వలన ఆశావర్కర్స్ తీవ్ర పని ఒత్తిడికి గురై అనారోగ్యంపాలౌతున్నారని అన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ ని ఆశాలుగా మార్చాలి. సమాన వేతనం, ఇతరసౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశా వర్కర్స్ సంఖ్యను పెంచాలని, పి.హెచ్.సికి వెళ్ళిన ప్రతి సందర్భంలో టిఎ, డిఎలు ఇవ్వాలని, 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, నాణ్యమైన మొబైల్స్, యూనిఫామ్ ఇవ్వాలని,ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ఎఎన్ఎం, జిఎన్ఎం శిక్షణ పొందిన ఆశాలకు పర్మినెంట్ పోస్టుల భర్తీ సందర్భంగా ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో యూనియన్ నాయకులు సుశీల.కళావతి, అప్పలమ్మ, క్రాంతికుమారి, భాగ్యం.రమణమ్మ.తదితరులు పాల్గొన్నారు.

# అదుపులోనే అతిసారం



**- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**- ఇంటింటి సర్వేతో బాధితుల గుర్తింపు.. 24 గంటలూ వైద్య సేవలు**

**నవతరం-శ్రీకాకుళం**

జిల్లా కేంద్రంలోని దమ్మలవీధి, గుడివీధి, మంగువారితోట, కాకివీధి ప్రాంతాల్లో ప్రబలిన అతిసారం ప్రస్తుతం అదుపులోనే ఉందని, ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 23న కేసులు వెలుగుచూసిన వెంటనే అధికార యంత్రాంగం అప్రమత్తమైందని, వైద్య ఆరోగ్య శాఖతో పాటు మున్సిపల్, రెవెన్యూ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో ముమ్మర చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఇప్పటివరకు మొత్తం 52 కేసులు నమోదు కాగా, బాధితులను రిమ్స్, కిమ్స్, జెమ్స్ వంటి ఆస్పత్రులకు తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నామని వివరించారు. దురదృష్టవశాత్తు ఒకరు మృతి చెందారని, ఐదుగురు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని అన్నారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల పరిహారాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ బాధితులకు అండగా ఉంటున్నామని కలెక్టర్ వివరించారు. అతిసార ప్రభావిత ప్రాంతాల్లో 24 గంటల పాటు వైద్య శిబిరాలు, యూపీహెచ్‌సీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. ప్రతి వీధికి ఒక వైద్య బృందం, శానిటేషన్, ఇంజినీరింగ్, ప్లానింగ్ బృందాలను కేటాయించి పారిశుధ్య పనులు, పైపులైన్ల లీకేజీల తనిఖీలను వేగవంతం చేశామన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, తొమ్మిది మంది కీలక అధికారుల పర్యవేక్షణలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

అత్యవసర పరిస్థితుల కోసం దమ్మలవీధిలో నాలుగు అంబులెన్స్‌లను నిరంతరం అందుబాటులో ఉంచామని, పరిస్థితి చక్కబడే వరకు వైద్య బృందాలు అక్కడే ఉండి సేవలు అందిస్తాయని స్పష్టం చేశారు. వ్యాధి నివారణకు ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తప్పనిసరిగా నీటిని కాచి చల్లార్చి తాగాలని కలెక్టర్ సూచించారు. సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీతో పాటు ఆరోగ్య విద్యపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. తాజా ఆహార పదార్థాలనే తీసుకోవాలని, ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో ఇప్పటికే కొందరు కోలుకుని డిశ్చార్జ్ అయ్యారని, మిగిలిన వారికి కూడా నిపుణులైన వైద్యులతో చికిత్స అందిస్తున్నామని, ఎటువంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.


### సమగ్ర సర్వే.. నివేదికలపై నిశిత దృష్టి:

అతిసారం ప్రబలిన ప్రాంతాల్లో పరిస్థితిని చక్కదిద్దేందుకు జిల్లా యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టిందని వివరించిన కలెక్టర్ ఇంకా ఏమన్నారంటే.. "ప్రతి సచివాలయం పరిధిలో 10 ప్రత్యేక బృందాలతో ఇంటింటి సర్వే నిర్వహిస్తూ, స్వల్ప లక్షణాలు ఉన్న వారిని సైతం గుర్తించి తక్షణ చికిత్స అందిస్తున్నాము. ముఖ్యంగా మంగువారితోట, దమ్మలవీధి, గుడివీధి, కాకివీధి ప్రాంతాల్లో వైద్య, శానిటేషన్, ఇంజినీరింగ్, ప్లానింగ్ విభాగాలతో కూడిన సమన్వయ బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. అటు మున్సిపల్ నీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసి, ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. సేకరించిన నీటి నమూనాలను ఇప్పటికే ల్యాబ్‌కు పంపగా, ఆ నివేదికలు అందిన తర్వాత అతిసారానికి ప్రధాన కారణాలను శాస్త్రీయంగా విశ్లేషించనున్నాము. అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ కలిగిన అంబులెన్స్‌లను క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉంచడంతో పాటు, కంట్రోల్ రూమ్ ద్వారా తొమ్మిది మంది కీలక అధికారులు పరిస్థితిని 24 గంటలూ సమీక్షిస్తున్నారు." అని కలెక్టర్ వివరించారు.

# పశువైద్యశాలలు పేరుకే మిగిలాయి, మందులు, పరికరాలు లేవు, సిబ్బంది లేరు

**- కూటమి ప్రభుత్వం వచ్చాకే పశుసంవర్ధక శాఖ పునరుజ్జీవనానికి చర్యలు**

**- వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**నవతరం -అమరావతి**

గత ఐదేళ్లలో పశుసంవర్ధక శాఖ నిర్వీర్యమయిందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శాసనసభలో ఎమ్మెల్యేలు పశు వైద్యశాలల్లో సౌకర్యాల కొరత, వైద్యుల నియామకాలపై అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో పశుసంవర్ధక శాఖలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, రైతులు, పశు పాలకులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కూడా అందించలేని దుస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. పశువుల చికిత్సకు అవసరమైన మందులు, ఆధునిక పరికరాలు లేవని, ఉన్న భవనాలు శిథిలావస్థలో ఉండగా, వాటిని చూసుకునే సిబ్బంది కూడా లేకుండా శాఖను నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో పశుసంవర్ధక శాఖ ద్వారా మొత్తం 3176 కేంద్రాలు పనిచేస్తున్నప్పటికీ, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వీటిలో చాలా కేంద్రాలు పేరుకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. రైతుల విరాళాలతో నిర్మించిన పాత భవనాలను కూడా సంరక్షించలేక, వాటిని శిథిలావస్థకు నెట్టారని ఆరోపించారు. గత ఐదేళ్ల పాటు పశుసంవర్ధక శాఖకు నిధులు కేటాయించకుండా, మౌలిక సదుపాయాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, ఫలితంగా పశువైద్యశాలలు మందులు, సిబ్బంది లేక రైతులకు ఉపయోగపడని పరిస్థితిలోకి వెళ్లాయని మంత్రి అన్నారు.

### కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే పశుసంవర్ధక శాఖకు ఊపిరి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పరిస్థితిని సమీక్షించి, పశుసంవర్ధక శాఖ పునరుజ్జీవనానికి చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి RIDF-NABARD / ESVHD నిధుల సహకారంతో ఇప్పటివరకు 485 భవనాలు నిర్మించినట్లు వివరించారు. 826 పశుసంస్థలకు సంబంధించిన భవనాలు దయనీయస్థితిలో ఉన్నాయని, వీటిలో 400 సంస్థలకు వెంటనే కొత్త భవనాలు అవసరం ఉండగా ఇందుకు రూ.265.10 కోట్లు, మరో 426 సంస్థలకు తక్షణ మరమ్మతుల కోసం రూ.37.40 కోట్లు అవసరమని మంత్రి వెల్లడించారు. ఈ అన్ని అవసరాలను దృష్టిలో పెట్టుకొని, 2026-27 నుంచి 2028-29 ఆర్థిక సంవత్సరాల మధ్య, RIDF-NABARD బడ్జెట్ కింద దశల వారీగా పశువైద్యశాలల భవనాల నిర్మాణం, మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తోందన్నారు. గత ప్రభుత్వంలా శాఖలను నిర్వీర్యం చేయడం కాకుండా, రైతులు, పశుపాలకులకు వాస్తవంగా ఉపయోగపడే విధంగా పశుసంవర్ధక శాఖను బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# రహదారి మరమ్మతుల వల్ల తాగునీరు కలుషితం

**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్**

**నవతరం-శ్రీకాకుళం**



శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో డయేరియా ప్రబలడంతో పదుల సంఖ్యలో ప్రజలు ఆస్పత్రుల్లో చేరడం కూటమి ప్రభుత్వ వైఫల్యమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో రహదారి మరమ్మతుల వల్ల తాగునీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉన్నప్పటికీ, ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే పరిస్థితి తీవ్రరూపం దాల్చిందని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యంతో 32 మంది ప్రజలు అనారోగ్యానికి గురయ్యారని అన్నారు. బాధితులకు తక్షణమే ఉచితంగా మెరుగైన వైద్యం అందించడంతో పాటు, కలుషిత నీటి సరఫరాకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం ప్రకటించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**